క్లుప్తంగా

హెచ్‌ఎంకు సన్మానం



నెల్లూరు(టౌన్) : నగరంలోని కొండాయపాళెం నగర పాలక ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం భాస్కర్‌రావును ఆయన మిత్రులు ముని, కృష్ణారెడ్డి, మల్లి సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా 1990–91 విద్యాసంవత్సరంలో దర్గామిట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుకున్నామన్నారు. తమ స్నేహితుడు భాస్కర్‌రావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, సుధ, .శ్రీకాంత్, .శ్రీనివాస్‌రెడ్డి, కేశవ్, రమణ, రాజీ, దేవ, రవి పాల్గొన్నారు.

50 కుర్చీల బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానానికి హరనాథపురానికి చెందిన రావిప్రోలు ప్రభావతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు నాగేశ్వరరావు రూ.25 వేల విలువ చేసే 50 కుర్చీలను సోమవారం బహూకరించారు. వీటిని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తలు ఎస్‌సీ బాలాజీసింగ్, జీసీ ధర్మసింగ్, ఈఓ బొగ్గల మల్లికార్జునరెడ్డికి అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు రామావఝుల శ్రీనివాసులుశర్మ పాల్గొన్నారు.

బీజేపీతోనే ఓబీసీ సాధికారత

నెల్లూరు(మినీబైపాస్): ఓబీసీ సాధికారత దిశగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోమారు మోదీ సర్కార్ నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సామాజిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాలోని ప్రతి గ్రామంలో బీసీ సామాజిక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

క్లెయిమ్‌ల పరిష్కారంపై చర్యలు చేపట్టాలి

కోవూరు: ప్రతి బీఎల్‌ఓ వారి పరిధిలో వచ్చిన క్లెయిమ్‌ల పరిష్కారంపై వేగంగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల బూత్ లెవల్ అధికారులతో సోమవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన ప్రతి క్లెయిమ్‌ను నిశితంగా పరిశీలించాలన్నారు. అదేవిధంగా ఇతర ప్రాంతంలో ఓటు ఉన్నా మరోసారి కొత్త ఓటు కోసం నమోదు చేస్తున్నారని, అలాంటి విషయాలపై ప్రత్యేక జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం బీఎల్‌ఓల వారీగా క్లెయిమ్‌లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, రవికుమార్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

25 మద్యం బాటిళ్ల పట్టివేత

తోటపల్లిగూడూరు : ప్రభుత్వ మద్యం షాపులో పనిచేసే సేల్స్‌మెన్ వద్ద సెబ్ అధికారులు 25 మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. నిందితుడిని సోమవారం కోర్టుకు హాజరుపరిచారు. ఇందుకూరుపేట ఎస్‌ఈబీ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మల్లికార్జునపురం (సాలిపేట) ప్రభుత్వ మద్యం దుకాణంలో ఈదూరు వినోద్‌కుమార్ గత కొన్నేళ్లుగా సేల్స్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. దుకాణ సమయం పూర్తయిన తరువాత స్వగ్రామం తోటపల్లిగూడూరులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్‌లో 25 మద్యం బాటిళ్లతో ఉన్న వినోద్‌కుమార్‌ను సెబ్ అధికారులు పట్టుకున్నారు. సోమవారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : ఆటోను బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపంలో సోమవారం జరిగింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న మోటారు బైక్ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటేష్‌కు గాయాలయ్యాయి. వెంటనే ప్రయాణికులు వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

మనుబోలు : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదివి బంగారు బాటలు వేసుకోవాలని ఎస్సై అజయ్‌కుమార్ సూచించారు. మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆశం ఉమారాణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు, కోడలు సుమన్, అనూష అందజేసిన పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు.

పాలనలోని తేడాను గమనించి ఓటేయండి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి
- పాత, కొత్తవెల్లంటి గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఆదాల, జెడ్పీచైర్‌పర్సన్ అరుణమ్మ, విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: గత టీడీపీ, నేటి వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనలోని తేడాను ప్రతిఒక్కరూ గమనించి రానున్న ఎన్నికల్లో ఓటు వేయాలని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ మండలం పాతవెల్లంటి, కొత్తవెల్లంటి గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి కొత్త వెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్, తదితర అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేశారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోను నూరుశాతం అమలు చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కొందరికే అందాయని గుర్తు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం జిల్లా పరిషత్ నిధులు రూ.46 లక్షలతో కొత్తవెల్లంటి నుంచి పాతవెల్లంటి వరకు సిమెంట్‌రోడ్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. రూ.16 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించామని చెప్పారు. జీజీఎంపీ కింద కొత్తవెల్లంటి, పాతవెల్లంటి గ్రామాల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. పాతవెల్లంటిలోని హైస్కూల్‌లో జిల్లా పరిషత్ సాధారణ నిధులు రూ. 5 లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మాణం చేపట్టామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకొనేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, పార్టీ రూరల్ అధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సీహెచ్ హరిబాబుయాదవ్, పార్టీ మండల అధికార ప్రతినిధి లంకా రామశివారెడ్డి, జిల్లా యూత్ నాయకులు పాతపాటి ప్రభాకర్, మహిళా నాయకురాలు రమణమ్మ, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలోకి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ఏపీసీ ఉషారాణి

నెల్లూరు(టౌన్): నగరంలోని బాలాజీనగర్‌లో ఉంటున్న ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి వలసొచ్చిన 20 గంగిరెద్దుల కుటుంబాలకు చెందిన మూడేళ్ల పైబడిన పిల్లలను సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐదేళ్ల పైబడిన పిల్లలను స్పెషల్ ట్రెయినింగ్ సెంటర్లలో సోమవారం చేర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ బడి బయట పిల్లలను ప్రతిఒక్కరూ బడిలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్‌బాబు, సీఎంఓ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి..పింఛన్ అందజేత

నెల్లూరు(బారకాసు): నగరంలోని ఏసీనగర్ ప్రాంతానికి చెందిన ఎర్రంశెట్టి రాజ్యలక్ష్మి భర్త మరణించడంతో వితంతు పింఛన్ పొందుతోంది. ఇటీవల ఆమె గుండె సంబంధిత వ్యాధితో అనారోగ్యం పాలైంది. ఇక్కడ ఆమెకు ఎవరూ లేకపోవడంతో ఒంగోలులోని బంధువుల వద్దకు వెళ్లగా అక్కడి కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని నిర్ధారించారు. తక్షణమే వైద్యం చేయాలని ఆరోగ్యశ్రీ కింద చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ నాగేశ్వరరావు ఒంగోలులోని కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి రాజ్యలక్ష్మికి సోమవారం పింఛన్ నగదు అందజేశారు. దీంతో రాజ్యలక్ష్మి ఆనందం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సచివాలయ ఉద్యోగికి కృతజ్ఞతలు తెలిపారు. ఓ వైపు ఆరోగ్యం బాగాలేకపోతే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు..మరోవైపు ఆస్పత్రిలో ఉన్నానని తెలుసుకుని పింఛన్ అందజేశారు..ఇలా ఈ రోజుల్లో ఎవరు సాయం చేస్తారు? ఇదంతా కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువే. ఆయన రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆమె తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు



పార్టీలో చేరిన ఆమంచర్ల వారితో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అమ్ములు
- 32వ డివిజన్‌కు చెందిన 500 కుటుంబాలు
- ఆమంచర్లకు చెందిన మరో 100 కుటుంబాలు
- ఎంపీ ఆదాల సమక్షంలో చేరిక



పార్టీలో చేరిన 32వ డివిజన్ వారితో ఎంపీ

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కోరారు. రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీలోని ఆమంచర్ల, మనవరప్పాడు, గోటువారికండ్రిగ గ్రామాలకు చెందిన డేగ గంగయ్య యాదవ్, పెంచలయ్య, సయ్యద్ బాబు ఆధ్వర్యంలో వంద కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం వారు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గనేడి వెంకటేశ్వర్లు నాయుడు(జీవీఎన్) ఆధ్వర్యంలో నెల్లూరులో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఎంపీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

జిల్లా టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ అమ్ములు చేరిక

జిల్లా టీడీపీ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ అమ్ములు ఆ పార్టీని వీడారు. సోమవారం 32వ డివిజన్‌లో పర్యటించిన రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఆమె వైఎస్సార్‌సీపీలో చేరింది. ఆమెతో పాటు అనుచరులు, స్నేహితులు ప్రమీల, జిలానీ, మున్నా, దయాకర్, తదితరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీ నుంచి పెద్దసంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరడం శుభపరిణామమన్నారు. పార్టీలోని ప్రతిఒక్కరికీ అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ పొట్లూరు స్రవంతి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మొబినా, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణ వెంకయ్య, క్లస్టర్ అధ్యక్షుడు బెజవాడ మేఘనాథ్‌సింగ్ నాయకులు దారా వంశీ, వైస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ



భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న ఉన్నతాధికారులు

పొదలకూరు (ముత్తుకూరు) : తమ సంస్థలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నట్లు నేలటూరులోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ సంస్థ కార్యకలాపాలు–నిర్వహణాధిపతి సునీల్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. ప్రాజెక్టులో సోమవారం జరిగిన 53వ జాతీయ భద్రత దినోత్సవాల్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణం, భద్రత, పాలన తదితర అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలు 10వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఉత్తమ పనితీరు కనబరచిన ఉద్యోగులు, సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. వారిచే ప్రతిజ్ఞ చేయించారు. సీఈఓ రాఘవ్ త్రివేది విజేతలను అభినందించారు.

వృద్ధుడిపై రౌడీషీటర్ దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగేందుకు నగదు ఇవ్వలేదని వృద్ధుడిపై రౌడీషీటర్ దాడిచేసి గాయపరిచిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..జేవీఆర్ఆర్ కాలనీలో రాజేశ్వరరావు నివాసం ఉంటున్నారు. ఆదివారం ఆయన పనినిమిత్తం బయటకు వెళుతుండగా అదే ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ మహేష్ అటకాయించాడు. మద్యం తాగేందుకు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజేశ్వరరావు లేవని చెప్పగా ఆయనపై మహేష్ దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవం

నెల్లూరు(బృందావనం): పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిరం ఆధ్వర్యంలో పాండురంగని ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని మంగళవారం ఉదయం 5 గంటల నుంచి బుధవారం ఉదయం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి సోమవారం తెలిపారు. సాయిదర్బార్ అద్దాల మందిరం సమీపంలోని ప్రాంగణంలో పండరి భజన గురువు లక్ష్మీసాయి ఆధ్వర్యంలో అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందని వివరించారు. భక్తులు పాల్గొని స్వామివారి కరుణకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఒక్కరి నేత్రదానంతో ఇద్దరికి చూపు



నెల్లూరు(అర్బన్): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరి అంధులకు కంటి చూపును ప్రసాదించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(పెద్దాస్పత్రి) ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్ తెలిపారు. మనుబోలు మండలం మడమనూరుకు చెందిన చప్పరం కామేశ్వరమ్మ(90) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యుల సహకారంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఐ డొనేషన్ కౌన్సెలర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ నేత్రదానం చేయాలనుకునే వారు 934711 1033, 99481 64781 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



నెల్లూరు(క్రైమ్): అనారోగ్యమో? మరే ఇతర కారణమో తెలియదుకాని గుర్తు తెలియని వ్యక్తి(35) బృందావనంలోని ఓ ఆస్పత్రి వెనుక వైపు రైలు పట్టాల సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మృతుడు బూడిదరంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, బులుగురంగు జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. స్థానిక వీఆర్వో శివకుమార్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం కుళ్లి దుర్గంధం వెదజల్లుతూ ఉంది. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై నాగేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కోవూరు : మండలంలోని పోతిరెడ్డిపాళెంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బి.విజయశ్రీ సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు తప్పక ఉండాలన్నారు. విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా దృష్టి సారించాలన్నారు.

స్పందనకు సకాలంలో హాజరుకావాలి



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): స్పందనకు అధికారులు సకాలంలో హాజరుకావాలని, లేని పక్షంలో శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ శర్మద స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నగర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ–2, ఇంజినీరింగ్–12, టౌన్‌ప్లానింగ్–10, హౌసింగ్ విభాగానికి–6 చొప్పున మొత్తం 30 వినతులు అందగా, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులకు సూచించారు. గత వారం స్పందన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. మౌలిక వసతుల కల్పన, కాలువలపై ఆక్రమణల తొలగింపు, జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు, టిడ్కో గృహాల కేటాయింపు, కల్వర్టులు, నూతన రోడ్ల నిర్మాణం, ప్యాచ్‌వర్క్ పనులు, తదితర సమస్యలపై ఎక్కువగా అర్జీలు అందాయని, వాటిని సత్వరమే పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీల పరిష్కారాలపై ప్రతి శుక్రవారం సమగ్ర నివేదికను అందజేయాలన్నారు. కొన్ని విభాగాల అధికారులు ఫిర్యాదులు పరిష్కారం కాకుండానే క్లోజ్ చేస్తున్నారన్నారు. ప్రజలు మళ్లీ ఫిర్యాదు రీ ఓపెన్ చేస్తున్నారని, సదరు అర్జీలను సంబంధిత విభాగాధిపతే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



మాట్లాడుతున్న భారతి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ స్టేడియం మహిళా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం భారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ముందస్తుగా సోమవారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ 2022 నేతాజీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ విశేషాలను వివరించారు. అపోలో ఆస్పత్రి డాక్టర్ ఏ రూప ఆరోగ్యపరంగా మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు అరుణాచలం, వై రాఘవరెడ్డి, ఎన్ బలరామయ్యనాయుడు, ఎస్ రాఘవేంద్రశెట్టి, వీ ప్రమీల, కే సుశీల తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యంపై రౌండ్ టేబుల్ సమావేశం



నెల్లూరు(బృందావనం): సరస్వతినగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో నెల్లూరు క్రిస్టియన్ జేఏసీ ఆధ్వర్యంలో మతసామరస్యంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. క్రిస్టియన్ జేఏసీ నాయకుడు కలివెల ఎలీషాకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 'భారత రాజ్యాంగం–క్రైస్తవ మైనార్టీల హక్కులు–సవాళ్లు–కార్యాచరణ' అనే అంశంపై చర్చించారు. ప్రధాన వక్తగా ప్రముఖ సామాజికవేత్త, ఫాదర్ పల్లితాన్ థామస్ విచ్చేసి మాట్లాడారు. దేశంలో రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమాన హక్కులు కల్పించిందన్నారు. కానీ కొందరు మతోన్మాదులు మైనార్టీల ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వివిధ ప్రజాసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నేతలు మూలం రమేష్ , రామరాజు, జిలానీఖాన్, అజయ్‌కుమార్, ఎల్లంకి వెంకటేశ్వర్లు, కేసీపీ, క్రైస్తవ సంఘాల నాయకులు దాసు, మనోహర్, జాన్సన్, హనోక్, క్రాంతి,విల్సన్ డేవిడ్, శోభన్, ఉదయకుమార్, బర్నాబాస్, ఉరందూరు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ



ధ్వజారోహణ చేస్తున్న అర్చకులు



తిలకిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం ఆలయ అర్చకులు బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆదిదంపతులను విశేషంగా అలంకరించి పల్లకిపై కొలువుదీర్చి నగరోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి సింహ వాహన సేవను కనులపండువగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా మాడిశెట్టి కోటయ్య, సుబ్బరత్నమ్మ జ్ఞాపకార్థంగా కుమారులు వరదరాజులు, శివకుమార్, శ్రీనివాసులు, మనవడు కోటిగౌతమ్ వ్యవహరించారు. ఆలయ ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఉమామహేశ్వరుల పల్లకిసేవ



నెల్లూరు(బృందావనం): నగరంలోని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు సోమవారం రాత్రి పల్లకిసేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఉమామహేశ్వరులకు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. ఆదిదంపతులను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా విజయ్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఉభయకర్తలుగా ములుమూడి చెంచుసుబ్బారావు స్మృత్యార్థం కుమారుడు బాలసుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

ఏ ముఖం పెట్టుకుని జయహో బీసీ సభకు వెళ్తున్నారు?



మాట్లాడుతున్న ఒట్టూరు సంపత్‌రాజు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బీసీలకు సీట్లు సాధించలేని వారు ఏ ముఖం పెట్టుకుని టీడీపీ జయహో బీసీ సభకు వెళ్తున్నారని రాష్ట్ర బీసీ సంఘ నేత ఒట్టూరు సంపత్‌రాజు ప్రశ్నించారు. నగరంలోని ఆదిత్యానగర్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆరు పార్లమెంట్, 35 అసెంబ్లీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులను ప్రకటించగా, అందులో రెండు సీట్లను మాత్రమే బీసీలకు కేటాయించిందన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించకుండా టీడీపీకు చెందిన బీసీ నాయకులు సభకు వెళ్లడం చూస్తే వారికి బీసీలపై ఉన్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇటీవల నెల్లూరులో జరిగిన బీసీ రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీలకు వైఎస్సార్‌సీపీ ప్రకటించిన వాటికన్నా ఒక్క సీటు టీడీపీ తక్కువగా కేటాయించినా పదవులకు రాజీనామా చేస్తామని ఆ పార్టీ బీసీ నాయకులు చెప్పారని, రాజీనామాలు చేయకపోయినా పర్వాలేదు కానీ మంగళగిరిలో జరిగే సభకు మాత్రం వెళ్లొద్దని కోరారు.

కరాటే పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



విజేతలతో కోచ్ ఫణీబాలాజీ

ఇందుకూరుపేట : జవహర్‌లాల్ మెమోరియల్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ఇందుకూరుపేటకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారని కోచ్ ఫణీబాలాజీ సోమవారం తెలిపారు. చిలకలూరిపేటలో ఆదివారం జరిగిన పోటీల్లో వివిధ విభాగాల్లో వీరు బ్రాంజ్, సిల్వర్, గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. ఈ మేరకు వారిని మాస్టర్ కోచ్ శ్రీనవాసరెడ్డి, తల్లిదండ్రులు అభినందించారు.